మంచుబొమ్మ

నీలవేణి కళ్లు చికిలించుకుని చూసింది. ఎదురుగా ఎండదెబ్బ తగిలినవాడిలా నడుచుకుంటూ వస్తున్నాడు గురువులు.

నీలవేణి ఆత్రుతతో ఉన్నట్లుండి లేవబోతే మోకాలిదగ్గర కలుక్కుమని విపరీతమైన బాధ కలిగింది. తప్పనిసరై మళ్లీ కూలబడిపోయింది. క్షణాలలోనే నొప్పి తగ్గింది. నిట్టూరుస్తూ గురువులువంక ప్రశ్నార్థకంగా చూసింది.

గురువులు అవతల ఎవరిపక్కనో కూర్చుని "ఏమి ఫరవాలేదు. అంతా సజావుగానే ఉంది. తర్వాత మాట్లాడుతాన్లెమ్మని" సైగ చేశాడు.

ఎదురుగా చిత్రీకరణకు అంతా సిద్ధంగానే ఉంది. కానీ సూర్యభగవానుడి దయ ఇంకా పూర్తిగా రావడంలేదు.

ఉదయం పదిగంటలు దాటినా పలుచని మబ్బులు కొద్దిగా కమ్ముకుని ఉండి సూర్యుడు దోబూచులాడుతున్నాడు. ఎండ ఎక్కువగా లేదు కానీ, చెమటలు దిగ్గారిపోతున్నాయి. ఇదేమి వాతావరణమో మరి!

నీలవేణి అలా చూస్తూ కూర్చున్నది. పక్కనే తనవంటివారు పదిహేనుమంది డాన్సర్లున్నారు. అందరూ దుప్పట్లో మరేవో కప్పుకుని ఉన్నారు. లోపల మాత్రం మొలచుట్టూ ఒక బిగుతైన డ్రాయరు, గుండెల చుట్టూ ఒక పీలిక ఉన్నాయి. మరోవైపు అలాగే పదిహేనుమంది మగ డాన్సర్లు. కొందరు ఆవులిస్తూ, మరికొందరు బీడీలు కాలుస్తూ, మరికొందరు అటూ ఇటూ పచార్లు చేస్తూనూ ఉన్నారు.

"ఎప్పటికి తెములుతుందో?" అన్నది నీలవేణి పక్కనే కూర్చుని ఉన్న షీలా.

"ప్చ్!" అన్నది నీలవేణి. అంతకన్నా ఆమె దగ్గర మాత్రం జవాబు ఏమున్నది గనక?

ఈ షీలా మొన్నమొన్నటివరకూ నిక్షేపంగా కాలేజీ చదువు వెలగబెట్టింది. డిగ్రీ ఏదో థర్డుక్లాసుది చేతికొచ్చింది కానీ, అది వొరగబెట్టిందేమీ లేదు. ఇంటి దగ్గర తండ్రి అవిటివాడు. మంచంలో ఉన్నాడు. తన తర్వాత ముగ్గురు చెల్లెళ్లు, ఆపైన మరో చిన్నపిల్లవాడూ. ఇన్ని పొట్టలు నిండాలి. అందువల్ల తనకు తటస్థపడిన రిక్షావాడితో సంబంధం పెట్టుకుని రహస్యంగా లాడ్జిల వెంట తిరిగి నాలుగు డబ్బులు సంపాదించి ఇంట్లో ఇస్తూ ఉండేది. ముందు అందరూ, తల్లి కూడా పిల్ల ఎక్కడో చిన్న ఉద్యోగం చేస్తున్నదని అనుకున్నారు. కానీ అలా ఎన్నాళ్లో సాగలేదు. ఇంట్లో తెలిసిన తర్వాత కూడా కొంప ఏమీ మునగలేదు. ఎవరూ అరిచి గోల చెయ్యనూలేదు. దానితో ఆ అమ్మాయి తెగించింది. అప్పుడప్పుడూ పట్టుబడినా

పోలీసులు తమకు కావలసిన రెండు విధాలుగానూ 'కృతార్థు'లై వొదిలేస్తూ ఉండేవారు. ఇప్పుడు ఆమెకిది కొత్త జీవితం. రెండిందాలా జరిగిపోతున్నది. పాత రిక్షావాడు పోయాడు. ఇప్పుడు మంచి నిర్వాహకుడొకడు దొరికాడు. వాడు గుట్టు చప్పుడు కాకుండా బేరాలు ఏర్పాటు చేస్తూ ఉంటాడు. అలా జీవితం ఫరావాలేదు ఉభయతారకంగా ఉంది.

ఎదురుగా కనుచూపుమేర అంతా ఆరుబయట సెట్టింగ్. నేల అంతా పచ్చపచ్చగా తివాచీ పరిచినట్టు కన్నుల పండువగా ఉంది. దానిమధ్య ఆఠీను ఆకారంలో వందల కిలోల రోజా పూలు తెచ్చి పరిచారు. అదుగో, ఆ పక్కనే పెద్ద గొడుగు కింద అనవసరంగా అలసట నటిస్తున్న కథానాయిక, ఆ పక్కనే కుర్చీలో జారగిలపడి కునుకు తీస్తున్న కథానాయకుడూ – కాస్సేపటిలో ఆ రోజాపూలమీద ముందు గంతులు వేసీ, ఆ తర్వాత ఒకరి మీద ఒకరు పడి దొర్లుతూనూ యుగళగీతం పాడతారన్న మాట. అప్పుడు తాము పదిహేనుమందీ. ఆ మగ డాన్సర్లు పదిహేనుమందీ వెనక చిత్ర విచిత్ర విన్యాసాలు చేస్తూ ఎగురుతారన్నమాట. నిన్ననేమో అక్కడే వందలాది బత్తాయికాయలు తెచ్చి పోసి వాటిమీదా హీరో హీరోయిన్లచేత పరుగులు పెట్టించీ, దొర్లించీ ఒక చరణం చిత్రీకరించారు. మొన్ననేమో వందలాది స్టీలు, ఇత్తడి బిందెలు తెప్పించి రకరకాలుగా అమర్చి వాటి మధ్య మరో చరణం చిత్రీకరించారు. అంతకుముందురోజు వందల కిలోల టమోటో పళ్లు తెప్పించి ఒక ఆవరణలో గుట్టలు గుట్టలుగా పోసి కృత్రిమ వర్షం కురిపించి ఆ వానలో నాయికా నాయకులచేత అడ్డమైన గంతులూ వేయించి ఇంకో చరణం చిత్రీకరించారు. మధ్యలో నాయికా నాయకుల వివిధ అనంగరంగ విన్యాసాలు... కెమెరా ఎక్కువభాగం నాయిక నాభీదేశంమీదనే ఉండటం మామూలే. ఈ దృశ్యాలన్నిటికీ వెనక తామూ, మగ డాన్సర్లూ రకరకాలుగా వికృత వేషాలు ధరించి ఎగరడం తప్పనిసరి.

హీరో ఇప్పుడు లేచి ఆవులించి ఎవరో ఏదో అంటే నవ్వుతున్నాడు. అతడు తెలుగు మాట్లాడితే భయంకరంగా ఉంటుంది. 'శోభా' అనడానికి బదులు 'షోబా' అనీ, 'విషయం' అనడానికి బదులు 'విషం' అనీ అంటాడు. అయినా ఫరవాలేదు. మరొకరెవరో అతనికి డబ్బింగ్ చెబుతూ ఉంటారు కాబట్టి, చూసే జనానికి ఆ రహస్యం తెలీదు కాబట్టి, తెలిసినా పట్టించుకోరు కాబట్టి ఫరవా ఏమీలేదు. పాట అయితే సరేసరి, ఎవరో ప్లేబాక్ పాడిపెడతారు కాబట్టి సమస్యే లేదు. విగ్రహం మాత్రం మహా దర్జాగా, దృఢంగా ఉంటుంది. అది చాలు అందరికీ.... ఎందుకయినా మంచిదని అతడు చాలా తక్కువగా మాట్లాడుతుంటాడు. అందువల్ల అతనికి అంతర్ముఖుడనీ, మితభాషి అని మంచి పేరు కూడా వచ్చింది.

ఇక నాయిక ఉత్తరాది అమ్మాయి. మాంచి పెద్దరసం మామిడిపండులాగుంటుంది. చాలా వినయశీలి. ఏ భాషా రాకపోయినా కష్టం

లేదామెకు. పాడేవారు పాడిపెడతారు. మాట్లాడేవారు మాట్లాడిపెడతారు. ఏం చెయ్యాలో చెప్పే దిగ్దర్శకులున్నారు. ఆమె వారెలా చెబితే అలా చేస్తూ ఉంటుందంతే!

షీలా ఏదోదో మాట్లాడి "ఇలాంటివి జనం చూస్తున్నారా?" అని అడిగింది.

"అదేమిటి? అట్లా అడుగుతావు? విరగబడి చూస్తున్నారు. సినిమాలే కాదు, సినిమాహాళ్ళ బయట ఉన్న పెద్ద పెద్ద పోస్టర్లను కూడా జనం గుంపులుగా నిలబడి చొంగలు కార్చుకుంటూ చూస్తున్నారు. వాళ్ళు చూడకపోతే వీళ్లు కోట్లకు కోట్లు కుమ్మరించి వీటిని ఎందుకు తీస్తారు పిచ్చిదానా!" అన్నది నీలవేణి.

నీలవేణి ఈసారి లేచి నిలబడి గురువులువంక చూసి చెయ్యి ఊపింది. అతడు నెమ్మదిగా నడుచుకుంటూ అటూ ఇటూ చూసి లేచి ఇవతలికి వచ్చాడు.

నీలవేణి నిట్టూరుస్తూ వచ్చి ఇవతల ఒక చెట్టు కిందికి చేరింది. మనసులో దిగులు... చింత... గురువులు రాగానే ఆదుర్దాగా "ఏమైంది? ఫోను చేశారా? ఎట్లా ఉంది చిన్నికి?" అని అడిగింది.

గురువులు నెమ్మదిగా "ఏమీ ఫరవాలేదు. అమ్మడికి జొరం తగ్గింది. పక్క ఇంటి మామి మందులు తెచ్చి వేసింది. డాక్టరు ఇంజక్షన్ కూడా ఇచ్చాడు. నువ్వేమీ కంగారు పడకు. అన్నట్టు రాత్రికి ఒక బేరం మాట్లాడాను. లాడ్జిలో... అయిదువందలు.. పూరా నైట్... తర్వాత మనం పొద్దున్నే వెళ్లిపోవచ్చు!" అన్నాడు.

నీలవేణి మనసు తేలికపడింది. ఇవాల్టితో ఈ పాట చిత్రీకరణ అయిపోతే ఇక వారంరోజులు స్వేచ్ఛ! వారం తర్వాత మరో పిక్చరులో మళ్లీ ఒక డాన్స్ సీక్వెన్స్ ఉంది. తన సంతానం ఒక్కగానొక్క ఆడపిల్ల మెదడు జబ్బుతో అవిటిదై పుట్టడం ఖర్మ కాక ఏమిటి? ఆనాడు తన కడుపులో ఈ పిండం పడటానికి కారణం ఎవడో తెలీదు. ఎవడో అస్తు బెస్తు అసమర్థపు అనారోగ్యపు వెధవై ఉంటాడు. లేకపోతే ఈ పిల్ల ఇలా పుట్టడం ఏమిటి? పేగు బంధం గట్టిది కావడం వల్ల తాను చాలామందివలె శిశువును మురికి కాల్వలో పారేయలేకపోయింది.

ఇప్పుడు నీలవేణి మనసు ఎంతో తేలికపడ్డట్టయింది. చేయెత్తి షీలాను రమ్మని సైగ చేసి పిలిచింది. షీలా రాగానే "అట్లా చాటుకు పోయొద్దాం, రా!" అన్నది ముందుకు నడుస్తూ.

షీలాది నవ్వు ముఖం. నవ్వుతూనే వచ్చింది. ఇద్దరూ బయలుదేరి కొన్ని గజాలు దూరంగా చెట్ల చాటుకు వెళ్లిపోయారు.

మరి రెండు నిముషాల్లో ఇవతలికి వచ్చి చూస్తే అక్కడ హడావుడి మొదలైనట్టున్నది. మైకులో గొంతులు మోగుతున్నాయి. అప్పటికి ట్యూన్‌కు అనుకూలంగా చేసిన వ్యాయామం, వేసిన గంతులు చాలవన్నట్టు మళ్లీ మొదలెట్టారు. ఈ ఇద్దరూ వెళ్లి తమతమ స్థానాల్లో కుదురుకుని వినిపించే ట్యూన్‌కు అనుగుణంగా కదలడం మొదలెట్టారు. 'లగ్గాయెత్తు' అనే పాట విని వినీ ఇప్పటికి విసుగుపుట్టింది. వినగా వినగా ఎలాగో వినిపిస్తున్న ఆ పాట ఏ పాతిక ముప్పైసార్లో విని ఉంటారందరూ.

నీలవేణి ఒగర్చుతూ నిలబడింది. ఎవరో బొంబాయి వారు కట్టిన వేగప్రధానమైన ట్యూన్ అది. నీలవేణికి ఆయాసం వచ్చింది. ముఖం చెమటతో నిండిపోయింది. తుండుతో ముఖం రుద్దుకుంటూ నిలబడిపోయింది. ఈ మధ్య ఎందుకో అలసటగా ఉంటున్నది. నాలుగడుగులు వేస్తే ఆయాసం... ఈ రోజుల్లో అందరికీ గుండెబాధలే. తనకూ అదేనేమో! ఇంత శరీరంలోనూ నరనరానికీ రక్తం సరఫరా చేసే గుండె అనబడే ఈ పిడికిలి అంత యంత్రం ఎంతకాలమని సజావుగా ఆడుతుంది? పైగా తెల్లవారి మనం చేస్తున్నవన్నీ ఆయుక్షీణపు పనులే కదా? మంచి తిండి లేదు. అవసరమైన వ్యాయామం లేదు. ఎంతయినా వ్యభిచారం వ్యాయామంతో సమానమవుతుందా? తానేమీ చిన్నపిల్ల కాదు ఇలా అడ్డమైన గంతులూ వేయడానికి. నలభై పైగా వొస్తున్నాయి ఏళ్లు నెత్తిమీదకి. ఇప్పుడైనా జాగ్రత్తగా ఉండటం మేలు. కానీ తనకు సాగదు మరి. పైగా తన పాపిష్టి డబ్బు నిలిచి చావదు కదా? ఎంత జాగ్రత్తగా ఉన్నా, చేతివేళ్ల మధ్యనుంచి జారిపోతూనే ఉంటుంది. ఇవాళ ఉన్నట్టుండి పోతే సజావుగా కట్టెను దాటించేందుకు సరిపడా డబ్బు అయినా ఉండిచావదు ఇంట్లో. ఇలా ఎగిరి ఎగిరి సంపాదించిన సొమ్ములో, పదిమంది దగ్గరా పడుకుని సంపాదించిన సొమ్ములో, రకరకాల సప్లయర్సు, పోలీసులు మొదలుకుని రిక్షావాళ్ల వరకు, రౌడీ వెధవల వరకూ అందరూ వాటాదారులే.

"నీకొచ్చిన కల గురించే ఆలోచిస్తున్నానింతసేపూ!" అన్నది షీలా.

"అట్లా కల వొస్తే తొరలో పెద్ద మొత్తం డబ్బు వస్తుందని అర్థం!"

నీలవేణి కళ్లు పెద్దవైనాయి. "నిజంగానా?" అని అడిగింది దగ్గుతూ.

"నిజంగానే. మా అమ్మ చెబుతూ ఉండేది!" అన్నది షీలా.

నిన్న రాత్రి పడుకుంటే పట్టకపట్టక నిద్రపడితే అందులో కల. రోడ్డు... రోడ్డుమీద అంతటా రూపాయి బిళ్లలు... ఏరుకుంటున్న కొద్దీ దొరుకుతూనే ఉన్నాయి.

ఇప్పుడు అంతా సిద్ధమై సూర్యభగవానుడనుగ్రహించి, దర్శకులకు, నాయికా నాయకులకు మూడ్ కుదరి మాటిమాటికీ మేకప్ సర్దుకుని ఆ కాస్త ముక్కా చిత్రీకరణ అయ్యేసరికి అందరికీ ఆయాసం వచ్చింది. తిరిగి బసకు చేరి నాలుగు మెతుకులు తినేసరికి సూర్యుడు పడమటికి దిగిపోతున్నాడు.

నీలవేణి కాస్సేపు పడుకుని లేచి ముస్తాబయింది. ఇంతకుముందు గురువులు తెచ్చిన వర్తమానం వినగానే... అదే చిన్నికి ఆరోగ్యం కుదుటపడిందని... మనసు తేలికపడింది. ఆ పసిపిల్ల కోసమే తాను బతుకుతున్నది... దాని అంగవైకల్యం మనసును నిరంతరం కాల్చివేస్తున్నా 'ఏదో ప్రాణాలతో ఉందిలే' అనే భావనతోనే తాను నెట్టుకొస్తున్నది. చదువా లేదు. ముఖానికి మంచికో చెడుకో రంగు అలవాటయిపోయింది. ముందు నాటకాల్లో ఆ తర్వాత ఇలా సినిమాల్లో .... ఏమాత్రమూ గుర్తింపు లేకపోయినా ఈమధ్య పరిస్థితి ఫరవాలేదు.

తనబోటి ఎక్స్‌ట్రాలు నాలుగు గంతులు వేస్తే డబ్బులు వస్తూనే ఉన్నాయి. గ్రాసవాసోదైన్యం మాత్రం లేదు. మగవాళ్లయితే కాస్త నదురుగా ఒడ్డూ పొడుగూ ఉంటే చాలు ఫైటింగ్స్‌లో చాన్సులొస్తూనే ఉన్నాయి.

చీకటి పడగానే గురువులు ఒక నలభై ఏళ్ల ఖరీదైన వ్యక్తిని వెంటబెట్టుకుని వచ్చాడు. అతన్ని లోపలికి తీసుకువచ్చి కాసేపు ఏవో కబుర్లు చెబుతూ కూర్చుని తర్వాత బయటకు వెళ్లిపోయాడు.

నీలవేణి అతన్ని శ్రద్ధగా చూసింది. వీడెవడో బాగా డబ్బున్న పక్షి. ఒక సినిమా హాలు, ఇంకేదో ఫాక్టరీ ఉన్నాయట... ఖరీదైన సిగరెట్లు ఊదేస్తున్నాడు. తాత తండ్రులు నానాగడ్డీ కరిచి కూడబెట్టిన సంపదను ఈ సిగరెట్లలా కొన్నాళ్లలో ఊదేయడం ఖాయం. వ్రేళ్లకు ఖరీదైన ఉంగరాలు, మెడలో జెర్రిపోతులాంటి బంగారు గొలుసు (అది కనిపించేట్టు చొక్కాపై గుండీలు రెండు మూడు విప్పి ఉంచుకున్నాడు కూడా)లతో మహా ఆర్భాటంగా ఉన్నాడు. రేపు అందరితో 'రాత్రల్లా సినిమా నటితో గడిపా'నని గొప్పగా చెప్పుకుంటాడు కాబోలు.

నీలవేణి లేచి పెద్ద లైటు తీసింది. చిన్న బల్బు మందంగా వెలుగుతున్నది. అతడు లేచి చొక్కా విప్పి ఒళ్లు విరుచుకున్నాడు.

తెల్లవారిన తర్వాత గురువులు బయటనుంచి కాలింగ్‌బెల్ మోగిస్తుండగా మెలకువ వచ్చింది. విటుడు ఎప్పుడో లేచి వెళ్లిపోయాడు.

గురువులు ముఖం అదోరకంగా ఉంది. ఆమెను తొందరపెడుతూ "కానివ్వు... కానివ్వు... బండి టైమైంది!" అంటూ లోపలికి వచ్చాడు. డబ్బు నీలవేణికి అందించాడు.

గురువులువంక చూసి నీలవేణి "ఏమిటి సంగతి? ఎందుకంత తొందర?" అని అడిగింది.

"ఏం లేదు... బండి టైమైందని..." అంటూ నసిగాడు గురువులు.

నీలవేణి లేచి స్నానం చేసి తయారై బయలుదేరింది. రాత్రి విటుడు మొట్టమొదట మంచం తిరగవెయ్యమన్నంతగా హడావుడి అయితే చేశాడు కానీ, అంతలోనే చల్లారిన అప్పడంలా చప్పబడిపోయి రొప్పుతూ వెనువెంటనే గురకపెడుతూ ఘరీ నిద్రకు పడ్డాడు దుంగలాగా.

మధ్యాహ్నం మూడుగంటల వేళకు ఇంటికి చేరుకున్నారిద్దరూ. వీధి మలుపు తిరుగుతూ ఉండగానే గురువులు నీలవేణి భుజంమీద చెయ్యివేసి, "అమ్మడూ! కాస్త సంబాళించుకో!" అన్నాడు లోగొంతుకతో.

"ఏమిటేమిటి?" అన్నది ఆదుర్దాగా నీలవేణి.

ఆటో ఇంటిముందు ఆగింది.

చిన్న ఆవరణలో పెద్ద మంచుగడ్డమీద... పక్కన ఇద్దరు ముగ్గురు ఆడవాళ్లు... నీలవేణి ఆకులా వణికిపోతూ, తూలిపోతూ నడిచింది.

గురువులు నెమ్మదిగా "నిన్న పక్క ఇంటివాళ్లకు ఫోను చేశాను అర్ధరాత్రి తర్వాత... అప్పుడు నీకెలా చెప్పను? ఎట్లాగూ తెల్లవారుతూనే బయలుదేరుతుంటిమి..." అంటున్నాడు.

నీలవేణికేమీ వినపడలేదు. కళ్లముందు అంతా చీకటి... గడ్డకట్టిన చీకటి... కూలబడింది.

గుండెల లోపలి జలధార ఉబికి ఉబికి వచ్చింది...!

❀ ❀ ❀